సాక్షి
తూర్పుగోదావరి
సోమవారం । 25 । డిసెంబర్ । 2023



రూ.1,01,116 విరాళం

అన్నవరం: సత్యదేవుని నిత్యాన్నదాన పథకానికి పి.వెంకట్రావు (రాజమహేంద్రవరం) ఆదివారం రూ.1,01,116 విరాళం సమర్పించారు.



నిత్యాన్నదానానికి రూ.లక్ష

ఆత్రేయపురం: ర్యాలి జగన్మోహిని కేశవస్వామి ఆలయంలో నిత్యాన్నదానానికి మండ వీర వెంకట సత్యనారాయణరెడ్డి దంపతులు (అనపర్తి) ఆదివారం రూ.1,00,116 సమర్పించారు.

డెల్టాలకు 11 వేల క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి డెల్టా కాలువలకు ఆదివారం 11 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఇందులో తూర్పు 3,400, సెంట్రల్ 1,600, పశ్చిమ డెల్టాకు 6,000 క్యూసెక్కుల చొప్పున వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.90 అడుగులుగా కొనసాగుతోంది.

న్యూస్‌రీల్

ముగిసిన వాలీబాల్ రాష్ట్ర జట్టు శిక్షణ

కొవ్వూరు: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యాన కొవ్వూరు ఎన్‌టీఆర్ క్రీడా ప్రాంగణంలో ఈ నెల 18 నుంచి వారం రోజుల పాటు నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ బాలికల వాలీబాల్ జట్టు శిక్షణ తరగతులు ఆదివారం ముగిశాయి. గౌతమీ స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యాన అవంతీ ఫీడ్స్ చైర్మన్ అల్లూరి ఇంద్రకుమార్ ఆర్థిక సహకారంతో ఈ శిక్షణ తరగతులు నిర్వహించామని అసోసియేషన్ అధ్యక్షుడు పరిమి హరిచరణ్ తెలిపారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు చెందిన 12 మంది బాలికలు ఈ శిక్షణ తరగతులకు హాజరయ్యారన్నారు. వీరు ఈ నెల 26 నుంచి 30వ తేదీ వరకూ తమిళనాడులోని తిరుచునాపల్లిలో జరిగే జాతీయ వాలీబాల్ పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. జట్టు సభ్యులకు ఇంద్రకుమార్ క్రీడా దుస్తులు అందజేశారు. కోచ్‌లుగా కె.సునీల్ (కడప), ఆర్.సురేష్ (కొవ్వూరు) వ్యవహరించారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ సమకూర్చిన క్రీడా దుస్తులను ప్రముఖ వ్యాయమోపాధ్యాయుడు పేరం రవీంద్రనాథ్ బాలికలకు అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు ఎస్.హమీరుద్దీన్, నాళం సత్యనారాయణ, పి.రఘురామ్, వాలీబాల్ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు కొయ్యల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కోటసత్తెమ్మ తల్లికి రూ.1.52 లక్షల ఆదాయం

నిడదవోలు రూరల్: తిమ్మరాజుపాలెంలో కొలువైన కోటసత్తెమ్మ తల్లి ఆలయానికి ఆదివారం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రధానార్చకుడు అప్పారావుశర్మ పర్యవేక్షణలో అమ్మవారికి ప్రత్యేక పుష్పాలంకరణ చేశారు. దర్శనాలు, ప్రసాదం, పూజా టిక్కెట్లు, ఫొటోల అమ్మకం ద్వారా అమ్మవారికి రూ.1,52,286 ఆదాయం సమకూరిందని ఆలయ ఈఓ బళ్ల నీలకంఠం (శివ) తెలిపారు.

నేటి స్పందన రద్దు

రాజమహేంద్రవరం సిటీ: క్రిస్మస్ పండగ సందర్భంగా ప్రభుత్వ సెలవు దినం కావడంతో ఈ సోమవారం కలెక్టరేట్‌లో స్పందన కార్యక్రమం నిర్వహించడం లేదని కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా, డివిజన్, మండల, సచివాలయాల పరిధిలో కూడా ఈ కార్యక్రమం జరగదని స్పష్టం చేశారు. జిల్లాలోని క్రైస్తవులందరికీ కలెక్టర్ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఏసుక్రీస్తు మానవునిగా జన్మించి, ప్రపంచ మానవాళికి శాంతి, కరుణ, ప్రేమతత్వాన్ని బోధించారని, ఆయన చూపిన సత్య మార్గాన్ని ప్రతి వ్యక్తీ ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. క్రీస్తు ఆశీస్సులు అందరిపై ఉండాలని ఆకాంక్షించారు.

కిక్కిరిసిన అయినవిల్లి క్షేత్రం



అయినవిల్లి విఘ్నేశ్వరుని సన్నిధిలో అభిషేక పూజల్లో భక్తులు

అయినవిల్లి: విఘ్నేశ్వరుని ఆలయం ఆదివారం భక్తులతో కిక్కిరిసింది. ప్రధానార్చకుడు అయినవిల్లి సూర్యనారాయణమూర్తి ఆధ్వర్యాన మేలుకొలుపు సేవ, అనంతరం విశేష పూజలు నిర్వహించారు. పంచామృత, ప్రత్యేక అభిషేకాల్లో 47 మంది, ప్రత్యేక దర్శనంలో 278 మంది, శ్రీలక్ష్మీ గణపతి హోమంలో 15 మంది పూజలు చేశారు. పది మంది నూతన వాహన పూజ చేయించుకున్నారు. 18 మంది చిన్నారులకు నామకరణలు, అక్షరాభ్యాసాలు జరిగాయి. వివిధ సేవల ద్వారా స్వామివారికి రూ.2,01,200 సమకూరిందని ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు, చైర్మన్ గుత్తుల నాగబాబు తెలిపారు.

దైవ కుమారునికి.. సుస్వాగతం



దేవరపల్లి మండలం గౌరిపట్నంలో కాంతులీనుతున్న నిర్మలగిరి పుణ్యక్షేత్రంలోని క్రీస్తు ఆలయం

- క్రిస్మస్ వేడుకలకు సర్వం సిద్ధం
- లోక రక్షకుని రాకడ కోసం ఊరూవాడా ముస్తాబు
- వెలుగులు విరజిమ్ముతున్న చర్చిలు
- ప్రారంభమైన ప్రత్యేక ప్రార్థనలు
- క్రీస్తు సందేశాలను స్మరించుకుంటూ పులకిస్తున్న క్రైస్తవులు



రాజమహేంద్రవరం పేపర్ మిల్లు వద్ద విద్యుద్దీప తోరణాల్లో లూథర్ గిరిలో లూథరన్ చర్చి

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం)/నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): కక్షలు, క్రోధాలు, అసూయాగ్ని జ్వాలల్లో దహించుకుపోతూ.. గాఢమైన పాపాంధకారంలో మునిగిన లోకంపై.. ప్రేమ, కరుణ, క్షమ వంటి మానవతా విలువల వెలుగులను ప్రసరింపజేసిన దైవ కుమారుడు.. ఆ ఏసుక్రీస్తు ఈ నేలపై ఉదయించిన పవిత్ర పర్వదినం.. క్రిస్మస్‌ను సోమవారం ఆనందోత్సాహాలతో నిర్వహించుకునేందుకు ఊరూవాడా ముస్తాబయ్యాయి. ఆ కరుణామయుని పుట్టిన రోజు వేడుకలను మనసారా నిర్వహిస్తూ, పునీతులయ్యేందుకు క్రైస్తవులు ఉవ్విళ్లూరుతున్నారు. వారందరి ఇంటా పండగ వాతావరణమే నెలకొంది. ప్రతి చర్చినీ ప్రత్యేకంగా అలంకరించారు. ఆదివారం రాత్రి నుంచే ప్రత్యేక ప్రార్థనలు ప్రారంభమయ్యాయి.

స్పిరిట్ ఆఫ్ క్రిస్మస్

లోక రక్షకుడైన ఆ క్రీస్తు పుట్టిన రోజు సందర్భంగా జరిగే సంబరాలు అన్నీ ఇన్నీ కావు. క్రైస్తవులు ఈ నెల రోజులూ హాలిడే సీజన్, సీజన్ ఆఫ్ గివింగ్, సీజన్ ఆఫ్ జాయ్‌గా జరుపుకొంటారు. ఆ మానవతామూర్తి వాక్కులు ఇచ్చే స్ఫూర్తిని హృదయాల్లో నింపుకొంటారు. దీనిని స్పిరిట్ ఆఫ్ క్రిస్మస్‌గా పిలుస్తారు. ప్రభువు రాకడను సూచిస్తూ.. క్రైస్తవులు ఇప్పటికే తమ ఇళ్లల్లో కాంతులు ప్రసరించేలా స్టార్‌లు ఏర్పాటు చేశారు. క్రిస్మస్ ట్రీలు అలంకరించారు. బాల ఏసు పశువుల పాకలో పుట్టిన దృశ్యాన్ని ఇళ్లు, చర్చిలలో బొమ్మల రూపంలో అందంగా రూపొందించారు.

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా..

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా వ్యాప్తంగా 5 వేల వరకూ పెద్ద, 10 వేల వరకూ చిన్న చర్చిలు ఉన్నాయి. వీటిని దాదాపు 12 వేల మంది పాస్టర్లు నిర్వహిస్తున్నారు. లూథరన్, బాప్టిస్టు, రోమన్ కేథలిక్, మన్నా మిషన్, బైబిల్ మిషన్, బెయెర్షబా, ఏసు ప్రేమాలయం తదితర క్రైస్తవ శాఖల ఆధ్వర్యాన క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు. కోనసీమ ప్రాంతంలో గోదావరి డెల్టా మిషన్ ఆధ్వర్యాన క్రిస్మస్ వేడుకలు భారీ స్థాయిలో నిర్వహిస్తారు. బైబిల్ క్విజ్, బైబిల్ లిటరరీ, పాటలు, వివిధ ఆటల పోటీలు నిర్వహిస్తారు. క్రీస్తు జననానికి సంబంధించిన నాటికలు ప్రదర్శిస్తారు. క్రిస్మస్ పర్వదినాన జరిగే కార్యక్రమంలో విజేతలకు బహుమతులు అందజేస్తారు. రోమన్ కేథలిక్ శాఖ ఆధ్వర్యాన ఆదివారం రాత్రే క్రిస్మస్ వేడుకలు ప్రారంభమయ్యాయి. వీరు రాత్రంతా చర్చిల్లోనే గడుపుతూ ప్రత్యేక గీతాలు ఆలపిస్తూ ప్రార్థనలు చేశారు. లూథరన్స్, బాప్టిస్టు ఆధ్వర్యాన ఆదివారం రాత్రి క్యాండిల్ సర్వీస్ నిర్వహించారు. లూథరన్స్ ఆధ్వర్యాన నిర్వహించే ప్రేమ విందులో చర్చి సభ్యులందరూ తమ కుటుంబ సభ్యులతో కలసి ఎంతో ఉత్సాహంగా పాల్గొంటారు. అమలాపురం మన్నా, తాళ్లరేవు, కాకినాడ జగన్నాథపురం చర్చి స్క్వేర్ సెంటర్‌లోని ఆంధ్రా బాప్టిస్టు, రోమన్ కేథలిక్, హౌస్ ఆఫ్ ప్రేయర్, క్రేగ్ ఇమ్మానుయేలు, క్రేగ్ మెమోరియల్, రిజర్వు పోలీస్ యూనియన్ బాప్టిస్టు, ఏపీఎస్‌పీ యూనియన్ బాప్టిస్టు, రామారావుపేట లూథరన్, పిఠాపురం సెంటినరీ బాప్టిస్టు, తుని ఆంధ్రా బాప్టిస్టు, నాసా చర్చిలు, రాజమహేంద్రవరం చర్చి ఆఫ్ షారోను, బైబిల్ ప్లేస్, సెంయింట్ పాల్స్ లూథరన్, పెద్దాపురం లూథరన్, బైబిల్ మిషన్, బాప్టిస్టు తదితర చర్చిల్లో క్రిస్మస్ వేడుకలు వైభవంగా నిర్వహిస్తున్నారు. రాజమహేంద్రవరంలోని సెయింట్ పాల్స్, లూథరన్, హోసన్న, మరనాత, జాన్‌వెస్లీ, ఆర్‌సీఎం, రెవరెండ్ మల్లిపూడి నెల్సన్ మెమోరియల్ లూథరన్ తదితర చర్చిలను విద్యుద్దీపాలతో అలంకరించారు.

నేడు ప్రత్యేక ఆరాధన

క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకుని అన్ని చర్చిల్లో సోమవారం ఉదయం 9.30 నుంచి 12.30 గంటల వరకూ ప్రత్యేక ఆరాధన నిర్వహిస్తారు. ఈ సందర్భంగా క్రిస్మస్ సందేశం అందించడానికి ప్రత్యేక అతిథులను ఆహ్వానిస్తారు. ప్రత్యేకంగా క్రిస్మస్ గీతాలు ఆలపించి, కేక్ కట్ చేస్తారు. కొన్ని చర్చిల్లో క్రీస్తు వెలుగుకు గుర్తుగా కొవ్వొత్తులు వెలిగించి క్యాండిల్ సర్వీస్ నిర్వహిస్తారు. క్రీస్తు వెలుగు కలిగి ఉంటామని చర్చిల్లో ప్రమాణం చేస్తారు. పరస్పరం శుభాకాంక్షలు తెలియజేసుకుంటూ క్రిస్మస్ కానుకలు పంచుకుంటారు. పేదలకు నూతన వస్త్రాలు పంచిపెడతారు. అనంతరం అందరూ కలసి క్రిస్మస్ విందు ఆరగిస్తారు.



రాజమహేంద్రవరం బాలాజీ పార్కు సెంటర్‌లో క్రిస్మస్ సందర్భంగా ఏర్పాటు చేసిన స్టార్లు



రాజమహేంద్రవరం సుబ్రహ్మణ్యం మైదానం వద్ద హోలీ ట్రినిటీ లూథరన్ చర్చిలో ఆకట్టుకుంటున్న విద్యుద్దీపాలంకరణ

క్రీస్తు ప్రేమ నిస్వార్థమైనది



ఏసు క్రీస్తు చేసిన ప్రతి కార్యంలో ప్రేమ ఉంది. పరలోకాన్ని విడిచి దాసుని రూపం ధరించి, పశువుల శాలలో జన్మించి, శిలువ మరణం పొందిన ఆ దేవుడు ప్రతి సందర్భంలో తన అమూల్యమైన ప్రేమను రుజువు చేశారు.

– డాక్టర్ జాన్‌వెస్లీ, అంతర్జాతీయ పరిచర్యకుడు, రాజమహేంద్రవరం

గ్రామీణ క్రీడాకారులను గుర్తించేందుకే 'ఆడుదాం ఆంధ్రా'



సభలో ప్రసంగిస్తున్న మంత్రి వేణు. చిత్రంలో బైరెడ్డి సిద్ధార్థరెడ్డి, జక్కంపూడి గణేష్ తదితరులు



మారథాన్ పరుగులో పాల్గొన్న ప్రజలు

- మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ
- ఉత్సాహంగా 3కే మారథాన్ పరుగు
- పాల్గొన్న శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): గ్రామీణ క్రీడాకారులను గుర్తించి, వారిని జాతీయ, అంతర్జాతీయ వేదికలపై నిలబెట్టేందుకే ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి రూపొందించారని రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార, పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. ఆడుదాం ఆంధ్రా క్రీడా సంబరాలను విజయవంతం చేయాలని కోరుతూ, వైఎస్సార్ సీపీ యువజన విభాగం రీజినల్ కో ఆర్డినేటర్ జక్కంపూడి గణేష్ ఆధ్వర్యాన స్థానిక ఐఎల్‌టీడీ జంక్షన్ గ్లోరిడెయో చర్చి నుంచి కోటిపల్లి బస్టాండ్ వరకూ 3కే మారథాన్ పరుగు నిర్వహించారు. వేలాదిగా యువత పాల్గొన్న ఈ కార్యక్రమానికి మంత్రి వేణు, రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ (శాప్) చైర్మన్, వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు బైరెడ్డి సిద్ధార్థరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వారికి మార్గం మధ్యలో మహిళలు, పార్టీ శ్రేణులు నీరాజనాలు పట్టారు. అనంతరం కోటిపల్లి బస్టాండ్ వద్ద జరిగిన సభలో మంత్రి వేణు ప్రసంగించారు. గ్రామీణ యువత క్రీడా ప్రతిభను వెలికితీసి, వారికి అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందించడమే ఆడుదాం ఆంధ్ర ప్రధాన ఉద్దేశమని అన్నారు. రానున్న కాలంలో జనసేన, తెలుగుదేశం కలిసి వస్తే, వారితో యువత ఆడుకోవాలని విజ్ఞప్తి చేశారు. గతంలో ఇంటికో ఉద్యోగం ఇస్తానంటూ యువతను మోసం చేసిన చంద్రబాబు.. నేడు లక్షల మందికి ఉద్యోగాలు కల్పించిన జగన్‌మోహన్‌రెడ్డిని విమర్శిస్తున్నారని దుయ్యబట్టారు. చంద్రబాబు ఆరు తలలతో ఎన్నికలకు సిద్ధమవుతున్నారని రామోజీ, రాధాకృష్ణ, టీవీ–5 నాయుడు, పవన్ కల్యాణ్, లోకేష్.. ఇలా ఎంతమంది కలిసి వచ్చినా అంతిమ విజయం జగన్‌దేనని మంత్రి వేణు స్పష్టం చేశారు.

బైరెడ్డి సిద్ధార్థరెడ్డి మాట్లాడుతూ, కరోనా అనంతరం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ప్రభుత్వ యంత్రాంగం అనేక కార్యక్రమాలతో నిత్యం ప్రజల్లోనే ఉంటున్నారని అన్నారు. ఆడుదాం ఆంధ్రా క్రీడా సంబరాల్లో వాలీబాల్, క్రికెట్, ఖోఖో, కబడ్డీ, బ్యాడ్మింటన్‌లలో ప్రతిభ ఉన్న వారిని గుర్తించి, అవసరమైన శిక్షణ ఇస్తామని చెప్పారు. ఆడుదాం ఆంధ్రా బ్రాండ్ అంబాసిడర్లుగా 16 మంది అంతర్జాతీయ క్రీడాకారులు ఉన్నారన్నారు. రాష్ట్రంలో మంగళవారం నుంచి 47 రోజుల పాటు ఈ క్రీడా సంబరాలు జరగనున్నాయని తెలిపారు. గ్రామ సచివాలయ, మండల, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో పోటీలు నిర్వహించి, విజేతలకు ప్రభుత్వం నగదు బహుమతులు అందిస్తుందని చెప్పారు. కష్టమైనా, నష్టమైనా, గెలుపైన ఓటమి అయినా నాయకులు నిత్యం ప్రజల్లోనే ఉండాలని అన్నారు.

జక్కంపూడి గణేష్ మాట్లాడుతూ యువతకు మంచి చేయాలనే దృఢ సంకల్పంతో సీఎం జగన్ మోహన్‌రెడ్డి ఆడుదాం ఆంధ్ర కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని అన్నారు. ఏ కార్యక్రమం చేపట్టినా సీఎం జగన్ ఎంతో చిత్తశుద్ధితో అమలు చేస్తారని చెప్పారు. మారథాన్ పరుగును విజయవంతం చేసిన యువకులందరికీ గణేష్ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వివిధ జిల్లాల యువజన విభాగ అధ్యక్షులు చౌటుపల్లి వీరన్న, పడమటి గిరిబాబు, విన్‌స్టన్‌బాబు, కేఎస్ఎన్ వర్మ, జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ మహమ్మద్ ఆరిఫ్, పార్టీ విద్యా విభాగం రీజినల్ కో ఆర్డినేటర్ నీలి ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

రాముడు ధర్మయోగి

సమన్వయ సరస్వతి సామవేదం షణ్ముఖశర్మ

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): రాముడు ధర్మయోగి అని సమన్వయ సరస్వతి సామవేదం షణ్ముఖశర్మ అన్నారు. హిందూ సమాజంలో వరుసగా 12వ రోజైన ఆదివారం కూడా ఆయన తన శ్రీరామాయణ ప్రవచనాన్ని కొనసాగించారు. సీతారామలక్ష్మణులు వనవాసానికి తరలి వెళ్లిన సన్నివేశాలను వివరించారు. 'ఏ ధర్మాన్ని నీవు ధృతితో, నియమంతో అంతఃపురంలో పాటిస్తున్నావో, అదే ధర్మం అడవిలో సైతం నిన్ను కాపాడుతుంది' అంటూ వనవాసానికి వెళ్తున్న రామునితో కౌసల్య అంటుందని చెప్పారు. 'వనవాసానికి సీతారామలక్ష్మణులు రాచబాటన నడచి వెళ్తుంటే అయోధ్యా వాసులు విలపించారు. ఏనాడూ అంతఃపురం దాటి రాని సీతమ్మను నేడు ఇలా చూస్తున్నాం. మనమందరం అయోధ్యను విడచి, వారితో వనాలకు వెళ్దాం. అక్కడి వన్యమృగాలు అయోధ్యకు వస్తాయి. అయోధ్య అడవి అవుతుంది. అడవి అయోధ్యగా మారిపోతుంది. అప్పుడు కైకేయి, ఆమె కుమారుడు ఈ రాజ్యాన్ని పాలించుకుంటారు' అంటూ ప్రజలు విలపించసాగారని సీతారాములు వనవాసానికేగే సన్నివేశాన్ని హృదయం కదిలించేలా సామవేదం వివరించారు. 'నాయనా! ఈ తండ్రి మాటను కాదని, నన్ను బంధించయినా, రాజ్య పాలన చేపట్టాలని దశరథుడు కోరినా, 'కనీసం ఈ ఒక్క రాత్రి అయినా, తమతో గడిపి, రేపు వనాలకు వెళ్లాలని అన్నా రాముడు అంగీకరించలేదు. పితృవాక్యపరిపాలకుడు అంటే తండ్రిని సత్యసంధుని చేయడమేనని సామవేదం చెప్పారు. 'తండ్రీ! నాకు రాజ్యభోగాలు, సంపదలు అక్కర లేదు. తుదకు స్వర్గసౌఖ్యాలు అక్కర లేదు. నీకు అసత్య దోషం రాకూడదు, అదే నేను కోరేది అని రాముడు చెబుతాడని, అందుకే రాముడు ధర్మయోగి అని వివరించారు. పలువురు ప్రముఖుల రచనలతో వెలువడిన 'రామాయణ మహోత్సవం' సంచికను సామవేదం ఆవిష్కరించారు.

'క్రికెట్ ప్రేమికులకు శుభవార్త చెబుతా'



విజేతకు ట్రోఫీ అందజేస్తున్న ఎంపీ భరత్‌రామ్, కమిషనర్ దినేష్‌కుమార్

ప్రకాశం నగర్ (రాజమహేంద్రవరం): నగరంలో క్రికెట్ ప్రేమికులకు త్వరలో శుభవార్త చెబుతానని వైఎస్సార్ సీపీ పార్లమెంటరీ చీఫ్ విప్, స్థానిక ఎంపీ మార్గాని భరత్‌రామ్ అన్నారు. ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల క్రీడా మైదానంలో ఆదివారం రాత్రి జరిగిన లెజెండ్ క్రికెట్ టోర్నమెంట్ ముగింపు సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. నగరంలో రెండు మూడు క్రీడా మైదానాలు నిర్మించాలని, క్రికెట్ స్టేడియంలు నిర్మించాలనేది తన కోరిక అని అన్నారు. దీనికి కొన్ని సాంకేతిక ఇబ్బందులు అడ్డం వస్తున్నాయని చెప్పారు. నాగుల చెరువు స్టేడియాన్ని ఎన్నికల నోటిఫికేషన్ వచ్చేలోగానే క్రికెట్ స్టేడియం చేయాలని, అందులో ఒక టోర్నమెంట్ అయినా ఆడించాలనేది తన తపన అని చెప్పారు. ఫ్లడ్ లైట్ల మధ్య తొలి క్రికెట్ టోర్నమెంట్ ఆడించి తీరుతానని చెప్పారు. భవిష్యత్తులో రాజమహేంద్రవరం నగరానికి మంచి క్రికెట్ గ్రౌండ్ అందిస్తానని హామీ ఇచ్చారు. నగర వాసుల ఆశీస్సులతో నగరాన్ని అభివృద్ధి దిశగా పరుగులు పెట్టించానని, మంచి యంగ్ అండ్ డైనమిక్ అధికారులు ఉన్నందు వల్లనే ఇది సాధ్యమైందని అన్నారు. రానున్న పదేళ్లలో రాజమహేంద్రవరాన్ని విశ్వనగరంగా తీర్చిదిద్దాలనేది తన లక్ష్యమని ఎంపీ భరత్‌రామ్ చెప్పారు. అనంతరం క్రికెట్ టోర్నీ విజేతగా నిలిచిన కెప్టెన్ బాలాజీ గ్లాడియేటర్స్ జట్టుకు ఆయన ట్రోఫీ అందించి అభినందించారు. రన్నర్స్ సర్దార్ లెవెన్ (కెప్టెన్ అమర్‌సింగ్) జట్టుకు విశిష్ట అతిథిగా పాల్గొన్న నగరపాలక సంస్థ కమిషనర్ కె.దినేష్ కుమార్ ట్రోఫీ అందజేశారు. మ్యాన్ ఆఫ్ ది సిరీస్ అమర్‌సింగ్‌కు నగరపాలక సంస్థ ఎస్ఈ పాండురంగారావు కప్ అందజేశారు. బెస్ట్ బ్యాట్స్‌మన్ కె.ప్రభాకరరావు, బెస్ట్ బౌలర్ అమర్‌సింగ్, సెమీ ఫైనల్స్‌లో సెంచరీ కొట్టిన సూర్యభాస్కరరావు, అమర్‌సింగ్‌లకు అతిథులు బహుమతులు అందజేశారు. ఈ టోర్నీలో పాల్గొన్న 8 జట్ల సభ్యులు 40 ఏళ్ల వయసు ఉన్న వారే కావడం విశేషం.

5 నుంచి ప్రపంచ తెలుగు మహాసభలు



సమావేశంలో మాట్లాడుతున్న గజల్ శ్రీనివాస్

దేవరపల్లి: తెలుగు భాషను వికసింపజేసే లక్ష్యంతో 72 ఏళ్ల కిందట ఏర్పాటు చేసిన తెలుగు సారస్వత పరిషత్‌ను పునరుద్ధరింపజేసే లక్ష్యంతో వచ్చే నెల 5, 6, 7 తేదీల్లో రెండో ప్రపంచ తెలుగు మహాసభలు నిర్వహిస్తున్నామని ఆ పరిషత్ అధ్యక్షుడు గజల్ శ్రీనివాస్ తెలిపారు. మానవత సంస్థ గౌరవాధ్యక్షుడు కేశిరాజు సీతారామయ్య నివాసంలో పరిషత్ గోపాలపురం నియోజకవర్గ శాఖ సమావేశం ఆదివారం దేవరపల్లిలో జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న గజల్ శ్రీనివాస్ మాట్లాడుతూ ఆంధ్ర సారస్వత పరిషత్, చైతన్య విద్యాసంస్థల సంయుక్త ఆధ్వర్యాన రాజరాజనరేంద్రుని పట్టాభిషేకం సహస్రాబ్ది నీరాజనంగా రాజమహేంద్రవరంలో ఈ మహాసభలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా ప్రాచీన కవుల కుటుంబాలకు పురస్కారాలు అందజేస్తామన్నారు. సభా ప్రాంగణంలో మూడు వేదికలు ఏర్పాటు చేస్తామని చెప్పారు. మహాసభలకు ఆరు రాష్ట్రాల గవర్నర్లు, నలుగురు కేంద్ర మంత్రులు, సినీ ప్రముఖులు, పీఠాధిపతులు, హైకోర్టు న్యాయమూర్తులు, 50 దేశాల నుంచి ప్రముఖులు హాజరవుతారని వివరించారు. వివిధ సాహిత్య ప్రక్రియలపై సదస్సులు ఏర్పాటు చేస్తున్నామన్నారు. వెయ్యి మంది కవులతో కవి సమ్మేళనం ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. సుమారు 15 వేల మంది విద్యార్థులు తెలుగు భాష, సంస్కృతిపై వివిధ కార్యక్రమాలు ప్రదర్శిస్తారన్నారు. ఆంధ్రమేవ జయతే నినాదంతో సదస్సులు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఆరో తేదీన తెలుగు సాహిత్య సభ ఏర్పాటు చేశామన్నారు. దేశంలోని అన్ని తెలుగు సమాజాల ప్రతినిధులు పాల్గొంటారని తెలిపారు. మహాసభలను పురస్కరించుకుని వచ్చే నెల రెండో తేదీన రాజమహేంద్రవరంలో 15 వేల మందితో శోభాయాత్ర నిర్వహిస్తున్నట్టు చెప్పారు. బస్టాండ్, రైల్వేస్టేషన్, ఎయిర్‌పోర్టు నుంచి ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నామని గజల్ శ్రీనివాస్ తెలిపారు. ఈ సమావేశంలో పరిషత్ నియోజకవర్గ శాఖ అధ్యక్షుడు అంబటి శ్రీనివాసరావు, సహాయ సంచాలకుడు కేశిరాజు రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఈట్ స్ట్రీట్‌లో అగ్ని ప్రమాదం



రాజమహేంద్రవరం ఈట్ స్ట్రీట్‌లో కాలిపోతున్న దుకాణం

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): స్థానిక ఆర్ట్స్ కళాశాల సమీపంలోని ఈట్ స్ట్రీట్‌లో శనివారం అర్ధరాత్రి 2.30 గంటల సమయంలో అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. ఈట్ స్ట్రీట్‌లో కంబాల రాజేష్‌కు చెందిన బీబీక్యూ దుకాణం, ఇంజరపు మధుసూదనరావుకు చెందిన జ్యూస్ షాపు పూర్తిగా కాలిపోయాయి. ఈ విషయం తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. సుమారు రూ.6 లక్షల ఆస్తి నష్టం జరిగి ఉండవచ్చని అగ్నిమాపక శాఖ అధికారులు చెబుతున్నారు. దుకాణాల్లోని సామగ్రి పూర్తిగా కాలి బూడిదయ్యాయి. అయితే ఎవరికీ ప్రమాదం జరగలేదు. విద్యుత్తు షార్ట్ షర్క్యూట్ వల్ల ప్రమాదం జరిగి ఉండవచ్చని భావిస్తున్నారు.

నడిపూడిలో తాటాకిల్లు దగ్ధం



బాధితుడికి సాయం అందిస్తున్న సర్పంచ్ నాని తదితరులు

అమలాపురం రూరల్: నడిపూడిలోని చప్పిడి వారిపాలెంలో శనివారం రాత్రి ఓ తాటాకిల్లు కాలిపోయింది. ఇంట్లో వంట చేస్తుండగా గ్యాస్ లీకవడంతో ఈ ప్రమాదం జరిగినట్లు బాధితుడు దొండపాటి లోవరాజు తెలిపారు. హుటాహుటిన అమలాపురం అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకుని మంటలను అదుపు చేశారు. ఇంట్లో విలువైన సామగ్రి, మోటార్ సైకిల్ తదితరాలు కాలిపోవడంతో రూ. 3 లక్షల ఆస్తి నష్టం జరిగినట్లు అధికారులు అంచనా వేశారు. బాధిత కుటుంబ సభ్యులను సర్పంచ్ చెల్లుబోయిన నాని పరామర్శించి ఆర్థిక సహాయం, నిత్యావసరాలు, దుస్తులు అందజేశారు. ఏఎంసీ మాజీ చైర్మన్ బొక్కా ఆదినారాయణ, కార్యదర్శి అనంతలక్ష్మి, వార్డు సభ్యులు ములపర్తి కనకదుర్గ, వీఆర్వో రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కల కళలాడేలా..



సీతా కల్యాణం నాటకంలో ఓ సన్నివేశం

- నంది నాటకోత్సవాలకు 'సీతా కల్యాణం' నాటకం ఎంపిక
- శ్రీసీతారామాంజనేయ నాట్య మండలి ప్రత్యేకత
- వన్నె తెస్తున్న కాకినాడ జిల్లా కళాకారులు

పిఠాపురం: ప్రతి ఒక్కరిలో ఏదో ఒక ఆసక్తి ఉంటోంది.. అందుకు అనుగుణంగా మనసుకు నచ్చిన రంగంలో రాణిస్తూ అభిరుచిని చాటుతుంటారు చాలామంది. అచ్చం అలాగే వృత్తుల వేరైనా, వారిని ఆసక్తే కలిపింది. అదే కళామతల్లికి సేవలో తరించేలా చేసింది.. అందరిలో ప్రత్యేకంగా నిలిపింది.. కళకు వన్నె తెచ్చేలా వారు సాగుతున్న పయనం అందరికీ ఆదర్శం. ఒకరు వైద్య ఉద్యోగైతే, మరొకరు విద్యాబుద్ధులు నేర్పే ఉపాధ్యాయుడు, ఇంకొకరు దేశానికే అన్నంపెట్టే రైతు.. ఇలా వారి జీవన గమ్యం వేరైనా ప్రవృత్తి మాత్రం కళాసేవే. ఆ కళంటే వారికి ప్రాణం. సమయం చిక్కితే చాలు కళామతల్లికి ప్రణమిల్లుతారు. ఏదో సరదాగా నాటకాలు వేయడం ప్రారంభించిన వారు ఇప్పుడు జాతీయ స్థాయి నాటక పోటీలకూ ఎంపికై అందరినీ ఆశ్చర్యపరుస్తున్నారు. వీరే కాకినాడలోని శ్రీసీతారామాంజనేయ నాట్యమండలిలో కళాకారులు.

కాకినాడలోని శ్రీసీతారామాంజనేయ నాట్య మండలిలో పది మంది కళాకారులు ఉన్నారు. వీరు 'సీతా కల్యాణం' పౌరాణిక పద్య నాటకం ప్రదర్శిస్తూ అందరిచే శభాష్ అనిపించుకుంటున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ చలనచిత్ర, టీవీ, నాటక రంగ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 26న గుంటూరులో నిర్వహించనున్న నంది నాటకోత్సవ పోటీలకు ఈ నాటకం ఎంపికైంది. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో 28 నాటక సమాజాలు పోటీ పడగా, 10 పద్య నాటకాలను ఎంపిక చేశారు. ఇందులో ఈ నాటకం ఉండడం విశేషం. నాటకంలో శ్రీరాముని పాత్రధారిగా పాలమూరు సీతారామకృష్ణ, లక్ష్మణుడిగా బి.కాశీ, నారదుడిగా ఎ.దక్షిణామూర్తి, విశ్వామిత్రుడిగా టి.కోదండరావు, దశరథునిగా పోతుల శ్రీనివాసు, జనకుడిగా ఎస్.సత్యనారాయణ, సీతగా ఎస్.సుజాత, రావణబ్రహ్మగా వైఎస్ కుమార్‌బాబు, మారీచునిగా పాలమూరి రామకృష్ణ మహాలక్ష్మి, సుబాహుడిగా పీవీ రమణ నటించి మెప్పిస్తున్నారు. పి.బాబూరావు, పి.శివ, కేవీ రమణ, ఉమా, వినయ్, పి.బాబూరావు సాంకేతిక సహకారం అందిస్తున్నారు. ఈ కళాకారులు వారి పెదవులపై పదములను నాట్యమాడిస్తున్నారు. గాత్రమే వారి జీవన సూత్రంగా కళను పది మందికి పంచిన వారి కృషి ఫలించి ఉత్తమ స్థాయికి తీసుకెళ్లింది. ఇందులో ప్రధానంగా గొల్లప్రోలు మండలం వన్నెపూడికి చెందిన వైద్యుడు పాలమూరు సీతారామకృష్ణ (రాముని పాత్రధారి), ఉద్యోగి అయిన పాలమూరు రామకృష్ణ మహాలక్ష్మి (మారీచుని పాత్రధారి), పిఠాపురానికి చెందిన ఉపాధ్యాయుడు పోతుల శ్రీనివాసు (దశరథ పాత్రధారి)లు ప్రత్యేకత చాటుతున్నారు. వివిధ వృత్తులు చేస్తూ వారిలోని కళను అందరికీ పంచుతున్నారు.

పురస్కారాలు.. సత్కారాలు

కళల కాణాచి విజయవాడకు చెందిన వేద గంగోత్రి ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో గతంలో తెనాలిలో నిర్వహించిన జాతీయ స్థాయి పద్య నాటక పోటీల్లో వీరు పాల్గొని అవార్డులు సొంతం చేసుకున్నారు. సీతా కల్యాణం పౌరాణిక రంగస్థల పద్య నాటకానికి పలు పురస్కారాలు వచ్చాయి. పన్నెండేళ్లుగా అనేక ప్రదర్శనలు ఇవ్వగా, 2018లో తిరుపతిలో నాటక పోటీల్లో బంగారు గరుడ అవార్డు, శ్రీకాళహస్తిలో రాష్ట్ర స్థాయి పరిషత్ నాటక పోటీల్లో ప్రథమ బహుమతి, సింహాచలంలో నాటక పోటీల్లో సింహాద్రి అవార్డులను గెలుచుకున్నారు. అదే స్ఫూర్తితో ముందుకు సాగుతున్నారు.


కళలపై ఆసక్తితోనే..



చిన్నప్పటి నుంచి కళలపై ఉన్న మక్కువతో నాటకాలు వేయడం నేర్చుకున్నాం. ఉద్యోగ రీత్యా అన్ని సమయాల్లో కుదరక పోయినా ఖాళీ సమయాల్లో శిక్షణ పొందుతూ అనేక ప్రదర్శనలు ఇచ్చాం. అంతరించి పోతున్న కళారంగాన్ని భావితరాలకు అందించాలన్న సదుద్దేశంతో నాటక రంగాన్ని ముందుకు తీసుకెళ్తున్నాం. ప్రస్తుతం నంది నాటకోత్సవాలకు ఎంపికవ్వడం మధురానుభూతిని మిగిల్చింది.

– పాలమూరు సీతా రామకృష్ణ, శ్రీరాముని వేషధారి, వన్నెపూడి


ప్రాణం ఉన్నంత వరకూ..



మన సంప్రదాయాలకు ప్రతీకలైన కళలకు దాసోహం అయ్యాం. పూర్వజన్మ సుకృతం వల్ల మాకు కళలు పోషించే అవకాశం వచ్చింది. మనసు పెట్టి నటించడం ద్వారా మంచి పేరును సొంతం చేసుకుంటున్నాం. నా ప్రాణం ఉన్నంత వరకూ కళకు ప్రాధాన్యం ఇస్తాం. నంది నాటకోత్సవాల్లో పాల్గొనే అవకాశం వచ్చింది. ఇందులో మా ప్రతిభను చూపి అవార్డును సొంతం చేసుకోవడానికి కృషి చేస్తాం.

– పోతుల శ్రీనివాసు, దశరథ పాత్రధారి, ఉపాధ్యాయుడు, పిఠాపురం

నాటకాలంటే ప్రాణం



చిన్నప్పటి నుంచి నాటకాలంటే ప్రాణం. అందుకే నాకు ఇష్టమైన కళను నేర్చుకుని ప్రదర్శనలు ఇచ్చి దానిలో మంచి గుర్తింపు తెచ్చుకున్నా. మా కృషి ఇన్నాళ్లకు ఫలించింది. నంది నాటకోత్సవాల్లో పాల్గొనే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నా. ఇందులో మంచి ప్రతిభ కనబరిచి అవార్డు తెచ్చుకోవడానికి మా శక్తి వంచన లేకుండా కృషి చేస్తాం. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటాం.

– పాలమూరు రామకృష్ణ మహాలక్ష్మి, మారీచుని వేషధారి

క్రీడలతో ఉజ్వల భవిష్యత్తు

- ఒలింపిక్ సంఘ చీఫ్ ప్యాట్రన్ కర్రి భామిరెడ్డి
- ఉత్సాహంగా తైక్వాండో బెల్ట్ పరీక్షలు



తైక్వాండో జాతీయ పోటీలకు ఎంపికైన క్రీడాకారులతో కర్రి భామిరెడ్డి, శ్రీనివాస్ కుమార్ తదితరులు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): విద్యార్థులు క్రీడలతో ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకోవచ్చని ఒలింపిక్ సంఘ చీఫ్ ప్యాట్రన్ కర్రి భామిరెడ్డి అన్నారు. ఆదివారం కాకినాడ శ్రీనగర్ మున్సిపల్ కార్పొరేషన్ ఆవరణలో జిల్లా తైక్వాండో సంఘం ఆధ్వర్యంలో వివిధ స్థాయిల్లో తైక్వాండో బెల్ట్ పరీక్షలు నిర్వహించారు. దీనికి కర్రి భామిరెడ్డి ముఖ్య అతిథిగా, జిల్లా క్రీడాభివృద్ధి అధికారి బి.శ్రీనివాస్‌కుమార్, జిల్లా ఎస్‌జీఎఫ్‌ఐ ప్రధాన కార్యదర్శి బీవీవీఎస్‌వీ ప్రసాద్ గౌరవ అతిథులుగా హాజరయ్యారు. తైక్వాండో సంఘ కార్యదర్శి బి.అర్జునరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా భామిరెడ్డి మాట్లాడుతూ తాను గురుకుల పాఠశాలలో చదివానని, 70 ఏళ్ల వయసులోనూ బ్యాడ్మింటన్ ఆడుతున్నానన్నారు. ఇటీవల సౌత్‌కొరియాలో జరిగిన వెటరన్ అంతర్జాతీయ బ్యాడ్మింటన్‌లో పాల్గొన్నానని తెలిపారు. ప్రస్తుత కాలంలో తమ పిల్లలకు చదువుతో పాటు క్రీడలకు తల్లిదండ్రులు ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. జిల్లా క్రీడాభివృద్ధి అధికారి బి.శ్రీనివాస్‌కుమార్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో ప్రభుత్వం క్రీడలకు పెద్దపీట వేస్తుందన్నారు. ఇందులో భాగంగా ఈ నెల 26 నుంచి 'ఆడుదాం ఆంధ్రా' పోటీలను రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తుందన్నారు. దీనికి జిల్లా నుంచి మంచి స్పందన వచ్చిందన్నారు. తైక్వాండో వంటి మార్షల్ ఆర్ట్స్ ప్రస్తుత కాలంలో ప్రతి ఒక్కరికీ అవసరమని అన్నారు. అనంతరం పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో జాతీయ స్థాయి తైక్వాండో పోటీలకు ఎంపికైన జిల్లా క్రీడాకారులను అతిథులు అభినందించారు. కార్యక్రమంలో జాతీయ స్థాయి రిఫరీలు, క్రీడాకారులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. జాతీయ స్థాయి ఎస్‌జీఎఫ్‌ఐ అండర్–14 విభాగానికి కె.దినకర్, అండర్–17కి కె.వీరనరసింహమూర్తి, పి.వశిష్ట్, బి.హర్షవర్ధన్, పి.ధనుష్‌తేజ, అండర్–19లో కె.పర్ణిక, కేబీఎస్ఎల్ శైలజ, ఎం.భువనేష్‌లు ఎంపికయ్యారని ఎస్‌జీఎఫ్‌ఐ కార్యదర్శి ప్రసాద్ తెలిపారు.

కాపులంతా ఐక్యంగా సాగుదాం..

- వన సమారాధనలో నేతల పిలుపు
- ముఖ్య అతిథులుగా ఎంపీ గీత, ఎమ్మెల్యే కన్నబాబు



కాపు వన సమారాధనలో శమీ పూజ వద్ద ఎంపీ వంగా గీత, ఎమ్మెల్యే కురసాల కన్నబాబు

కాకినాడ రూరల్: కాపులంతా ఐక్యంగా ముందుకు సాగుదామని పలువురు ఆ సంఘ పెద్దలు పిలుపునిచ్చారు. కాకినాడలోని శుభం కాపు కల్యాణ మండపంలో ఆదివారం కాపు సద్భావన సంఘం ఆధ్వర్యంలో వన సమారాధన జరిగింది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని పలువురు సంఘ నేతలు పాల్గొని కాపుల ఐక్యత గురించి తమ సందేశం ఇచ్చారు. ఎంపీ వంగా గీత, ఎమ్మెల్యే కురసాల కన్నబాబు, వైఎస్సార్ సీపీ కాకినాడ నగర అధ్యక్షులు సుంకర శివప్రసన్న, జీఎన్‌టీయూకే ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యుడు బెజవాడ వీర వెంకట సత్యనారాయణ, గోపుశెట్టి బాబ్జీ, లింగం రవి, నేమాం సర్పంచ్ రామదేవు చిన్నా తదితరులు ముఖ్య అతిథులుగా పాల్గొని తొలుత శమీ పూజ చేశారు. వివిధ ప్రాంతాల నుంచి కుటుంబ సభ్యులతో హాజరైన కాపు కులస్తులను ఎంపీ గీత, ఎమ్మెల్యే కన్నబాబు ఆప్యాయంగా పలకరించారు. కాపు సద్భావన సంఘ రాష్ట్ర అధ్యక్షుడు వాసురెడ్డి ఏసుదాసు పర్యవేక్షణలో సంఘ గౌరవ అధ్యక్షుడు బసవా ప్రభాకర్, చిట్నీడి శ్రీనివాసరావు, బిందాన సురేష్ తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే వరుపుల సుబ్బారావు, మాజీ ఎమ్మెల్సీ చిక్కాల రామచంద్రరావు, జెడ్పీ డిప్యూటీ చైర్మన్ బుర్రా అనుబాబు, కాపు జేఏసీ నేతలు నల్లా విష్ణుమూర్తి, ఆకుల రామకృష్ణ, కల్వకొలను తాతాజీ, కాకినాడ మాజీ మేయర్ సుంకర పావని, తోటకూర శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఆటలకు అధిక ప్రాధాన్యం

ఎమ్మెల్యే పెండెం దొరబాబు



విజేతలకు కప్ అందజేస్తున్న ఎమ్మెల్యే పెండెం దొరబాబు

పిఠాపురం: ప్రభుత్వం ఆటలకు అధిక ప్రాధాన్యం ఇస్తోందని ఎమ్మెల్యే పెండెం దొరబాబు అన్నారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా రెజ్లింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పిఠాపురంలో రాష్ట్ర స్థాయి రెజ్లింగ్ పోటీలు నిర్వహించారు. ఇందులో విజేతలకు ఆదివారం ఎమ్మెల్యే బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా రెజ్లింగ్ అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ గుబ్బల ఎలీషాకుమార్ మాట్లాడుతూ రెండు రోజులుగా పిఠాపురంలో రాష్ట్ర స్థాయి రెజ్లింగ్ పోటీలు నిర్వహించి క్రీడాకారులను ఎంపిక చేశామన్నారు. ఈ పోటీల్లో విజేతలు ఈ నెల 27న ఉత్తరప్రదేశ్‌లోని గోండాలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బొజ్జా మాణిక్యాలరావు, కొత్తపల్లి బుజ్జి, లోవరాజు తదితరులు పాల్గొన్నారు.

మానసిక ఉల్లాసానికి క్రీడలు దోహదం

రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దొరబాబు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న దవులూరి దొరబాబు

సామర్లకోట: క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయని రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. స్థానిక ప్రభుత్వ హైస్కూల్ ఆవరణలో ఆదివారం రాష్ట్రంలో 13 జిల్లాలకు సంబంధించి క్లాస్ కంట్రీ మీట్ జరిగింది. ఈ సందర్భంగా 5కే, 10కే రన్‌లను దవులూరి చారిటబుల్ ట్రస్టు అధినేత, రాష్ట్ర కార్మిక సంఘ మాజీ కార్యదర్శి దవులూరి సుబ్బారావు ప్రారంభించారు. ఈ పోటీల్లో వివిధ విభాగాలకు సంబంధించి 250 మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఓవరాల్ చాంపియన్‌గా విశాఖపట్నం నిలిచింది. విజేతలకు దవులూరి దొరబాబు బహుమతులు అందజేశారు. రాష్ట్ర స్థాయి పోటీలు సామర్లకోటలో జరగడం ఎంతో ఆనందంగా ఉందని ఆయన అన్నారు. నాలుగు కేటగిరీల్లో 32 మంది క్రీడాకారులు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారని సీనియర్ ఫిజికల్ డైరెక్టర్ రంగారావు తెలిపారు. ఈ పోటీలు జనవరి 15 నుంచి బీహార్ రాష్ట్రం గయాలో జరుగుతాయన్నారు. కాకినాడ జిల్లా స్పోర్ట్స్ అథారిటీ అసోసియేషన్ కార్యదర్శి కె.సుబ్రహ్మణ్యం, మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ, వైస్ చైర్మన్ ఉబా జాన్‌మోజెస్, క్రిస్టియన్ మైనారిటీ కో ఆప్షన్ సభ్యుడు కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

దాతల సహకారంతో బాలుడికి సంపూర్ణ ఆరోగ్యం




సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ మాజీ సభ్యుడు పాలూరి బోసుబాబు

గోకవరం: అరుదైన బోన్‌మేరో వ్యాధితో బాధపడుతున్న బాలుడు అక్షయ్‌రామ్ సంపూర్ణ ఆరోగ్యంతో ఉన్నాడని జెడ్పీటీసీ మాజీ సభ్యుడు పాలూరి బోసుబాబు తెలిపారు. ఆదివారం గోకవరంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామానికి చెందిన అక్షయ్‌రామ్ గత జనవరిలో బోన్‌మేరో వ్యాధితో బాధపడుతుండగా, వైద్యానికి సుమారు రూ.24 లక్షల వరకూ ఖర్చవుతాయని వైద్యులు తెలిపారన్నారు. దీనిపై దాతల సహకారం కోరగా అనేక మంది దాతలు, అన్నివర్గాల ప్రజలు, స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చి సుమారు రూ.14 లక్షల ఆర్థిక సహాయం చేశారన్నారు. అలాగే ప్రధానమంత్రి సహాయనిధి నుంచి రూ.3 లక్షలు, రతన్‌టాటా సంస్థ నుంచి రూ.4 లక్షలు సహకారం అందించారన్నారు. ప్రస్తుతం బాలుడికి వైద్యం జరిగి సంపూర్ణ ఆరోగ్యంతో ఉన్నాడన్నారు. బాలుడి కుటుంబ సభ్యుల తరఫున దాతలందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

సుబ్రహ్మణ్యేశ్వరుని ఆలయంలో నాగుపాము



సుబ్రహ్మణ్యస్వామి విగ్రహంపై నాగుపాము

నల్లజర్ల: అనంతపల్లి స్వర్ణదుర్గాశ్రమంలోని సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో ఆదివారం ఓ పాము ప్రత్యక్షమైంది. సుబ్రహ్మణ్యస్వామి విగ్రహంపై ఆ నాగుపాము పడగవిప్పి బుసలు కొట్టింది. ఉదయం 7 గంటల నుంచి ఈ విధంగా బుసలు కొడుతూనే ఉంది. ఈ విషయం తెలుసుకున్న ప్రజలు తండోపతండాలుగా తరలివచ్చారు. ఆశ్రమ నిర్వాహకుడు కొండమూరి గోపాలం మాట్లాడుతూ ఈ పరిసర ప్రాంతంలో పాములు తిరగడం సర్వసాధారణమన్నారు. అయితే ఈ తరహాలో సుబ్రహ్మణ్యస్వామి విగ్రహంపై పడగవిప్పి కనిపించడం ఇదే మొదటిసారి అని అన్నారు.

రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి



సీపీఐ కార్యాలయంలో ఐక్యత చాటుతున్న జిల్లా రైతు సంఘం నాయకులు

ప్రకాశంనగర్ (రాజమహేంద్రవరం): ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర 18వ మహాసభలు జనవరి 8, 9, 10 తేదీల్లో రాజమహేంద్రవరంలో జరుగుతాయని, పెద్ద ఎత్తున రైతులు హాజరై జయప్రదం చేయాలని ఆ సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్ పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో రైతు మహాసభల జిల్లా అధ్యక్షుడు పంతం నాగేశ్వరరావు అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్ర మహాసభలకు రైతు సంఘం జాతీయ అధ్యక్షుడు రావుల వెంకయ్య తదితరులు హాజరవుతారని చెప్పారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డేగ ప్రభాకర్, జిల్లా కార్యదర్శి తాటిపాక మధు, జట్ల లేబర్ యూనియన్ అధ్యక్షుడు కొండ్రపు రాంబాబు, నగర కార్యదర్శి వి.కొండలరావు, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కె.జ్యోతిరాజు తదితరులు పాల్గొన్నారు.

'తాండవ'లోకి దూకి వ్యక్తి ఆత్మహత్య

తుని: స్థానిక తాండవ నదిలోకి గుర్తు తెలియని వ్యక్తి దూకి ఆత్మహత్య చేసుకున్నాడని తుని పట్టణ సీఐ గీత రామకృష్ణ తెలిపారు. ఆదివారం మధ్యాహ్న సమయంలో తుని– పాయకరావుపేట తాండవ బ్రిడ్జిపై నుంచి గుర్తు తెలియని వ్యక్తి దూకినట్టు స్థానికులు చెప్పారన్నారు. ప్రాథమికంగా లభించిన సమాచారం మేరకు భిక్షాటన చేసుకునే వ్యక్తిగా భావిస్తున్నామన్నారు. మృతదేహం కోసం గాలిస్తున్నామని, దొరికితే పూర్తి వివరాలు తెలిసే అవకాశం ఉందన్నారు.

హోమ్‌కు మతిస్థిమితం లేని మహిళలు



గుంటూరు జిల్లాలోని కరుణామం హోమ్ ప్రతినిధులకు ఇద్దరు మహిళలను అప్పగిస్తున్న టీమ్ సభ్యులు

అమలాపురం టౌన్: మతిస్థిమితం లేకుండా అమలాపురంలో తిరుగుతున్న ఇరువురు మహిళలను గుంటూరు జిల్లా పొన్నూరులోని శాంతోమ్ కరుణామయం హోమ్‌కు శనివారం రాత్రి పట్టణ పోలీసులు తరలించారు. జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా ఆదేశాల మేరకు పట్టణ సీఐ టి.క్రాంతికుమార్, మహిళా ఎస్సై ఎల్.దేవసుధ, ఐసీడీఎస్ డీసీపీఓ ఎం.శ్రీనివాస్, సీడీపీఓ కేవీఎల్‌డీ కుమారి పర్యవేక్షణలో ఈ తరలింపు ఏర్పాట్లు చేసినట్లు డీఎస్పీ ఎం.అంబికా ప్రసాద్ తెలిపారు. స్థానిక హౌసింగ్ బోర్డు కాలనీలో మానసికస్థితి సరిగ్గా లేక తిరుగుతున్న ఓ మహిళను కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆస్పత్రికి ఈ నెల 15న తరలించగా రెండు రోజుల తర్వాత ఆమె అక్కడ నుంచి పారిపోయి మళ్లీ పట్టణానికి చేరుకుందని అన్నారు. ఆమెతో పాటు మామిడికుదురు మండలానికి చెందిన మతిస్థిమితం లేని మరో మహిళను గుంటూరు జిల్లాలోని హోమ్‌కు తరలించామన్నారు. పోలీస్ ఎస్కార్ట్ టీమ్ సభ్యుల పర్యవేక్షణలో ఆ మహిళలను క్షేమంగా హోమ్‌కు అప్పగించినట్లు చెప్పారు. తొలి నుంచి ఈ మహిళలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు సహకరించిన స్థానిక వివిధ సంఘాల మహిళా నాయకులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులకు డీఎస్పీ కృతజ్ఞతలు తెలిపారు.

శ్రీఆంజనేయం.. ప్రసన్నాంజనేయం

స్వామికి లక్ష అరటి పండ్లతో అర్చన



ద్రాక్షారామ భీమేశ్వరాలయ ప్రాంగణంలో ప్రసన్నాంజనేయస్వామికి అరటి పండ్లతో అర్చన

రామచంద్రపురం రూరల్: శ్రీఆంజనేయ.. ప్రసన్నాంజనేయ అంటూ ఆ స్వామి వారిని భక్తులు కొలిచి తరలించారు. ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో వేంచేసి ఉన్న ప్రసన్నాంజనేయస్వామి ఆలయం వద్ద ఆదివారం హనుమత్ వ్రతం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి లక్ష కదళీ ఫలాల (అరటి పండ్లు)తో అర్చన వైభవంగా జరిపారు. జుత్తిక చిన్నా, ఇంద్రకంటి రత్నసాగర్, వైదిక బృందంచే ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మాణిక్యాంబా మహిళా సమాజం సభ్యులు పారాయణ చేశారు. ఆలయ ఈఓ పితాని తారకేశ్వరరావు, దాత సత్తి సుబ్బారెడ్డి, మాణిక్యాంబ మహిళా సమాజం వ్యవస్థాపక అధ్యక్షురాలు కారుమూరి నాగరత్న వజ్రం, సభ్యులు వెచ్చా కృష్ణవేణి, మణికొండ విజయలక్ష్మి, మేడిద సత్యమంగతాయారు, గుత్తుల సీతారత్నం, కోన లక్ష్మి పాల్గొన్నారు.